క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి విశేష పూజలు



స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, లక్ష దూర్వార్చన, లఘున్యాసం, ఏకదశ రుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలు జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట: గంగలకుర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలో గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి, అమలాపురం రూరల్ పాలగుమ్మి, నడిపూడి, ఎన్.పెదపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33, 11 కేవీల మెయింటినెన్స్, చెట్లు ఆకుల తొలగించుట వంటి మరమ్మతులు చేయనున్నామని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ ఎ.హరిబాబు కోరారు.

నేడు అయినవిల్లిలో గడపగడపకూ..

అయినవిల్లి: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, వివిధ ఆలయాల చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

రూ.7.23 లక్షలకు రేవు వేలం ఖరారు

మామిడికుదురు: కరవాక-ఓడలరేవు వేలంపాట రూ.7.23 లక్షలకు శుక్రవారం ఖరారైంది. కరవాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ జి.మల్లికార్జునరావు అధ్యక్షతన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రేవు వేలం పాట నిర్వహించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు కరవాక-ఓడలరేవు ద్వారా ప్రయాణికులను రేవు దాటించేందుకు హక్కులను పొందారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేకాడి సత్యనారాయణ, మల్లాడి మంగాయమ్మ, ఈఓపీఆర్డీలు జి.శివరామకృష్ణ, ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

అంబాజీపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పలువురు యువకులు పేర్కొన్నారు. రామ్‌చరణ్ పుట్టినరోజు పురస్కరించుకుని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కోనసీమ రామ్‌చరణ్ యువశక్తి ఇన్‌చార్జి మంచాల నోకేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుబ్బారావు, బోనగిరి భూషన్, తోట బాబి, రవణం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ మధురం

అంబాజీపేట: కంటికి రెప్పలా చూసుకుంటూ తన బిడ్డ భవిష్యత్తే అహర్నిశలు శ్రమించే మాతృమూర్తి ప్రేమ ఎంతో మధురమని హెచ్ఎం బీర హనుమంతరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సత్యసాయి పుట్టినరోజు సందర్భంగా మాతృమూర్తి-అమ్మ ప్రాధాన్యతపై విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్‌లలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. 6 నుంచి 10 వరకూ 203 సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం

మలికిపురం: లక్కవరం గ్రామానికి చెందిన నేదునూరి వెంకటేశ్వర్లు ఇటీవల డాబా పై నుంచి ప్రమాదవశాత్తూ పడి గాయపడ్డాడు. అతనికి పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన పలువురు సమకూర్చిన రూ.5 వేల ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో రుద్రరాజు మాధ్రాజు, దొంగ సతీష్, బాలాజీ, రాజగోపాల్, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురు జెడ్పీ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఓ దాత పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. దాతను పలువురు విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన సిద్దాని భవానీలక్ష్మణ కుమార్ పుట్టినరోజు పురస్కరించుకుని ఏటా అక్టోబర్ 5న అన్నదానం జరిపించాలని కోరుతూ శుక్రవారం రూ.10,116 విరాళం అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగ వరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందించారు.

క్షయను సమూలంగా నిర్మూలించాలి

- పలు పీహెచ్‌సీల్లో అవగాహన సదస్సులు
- ర్యాలీలు నిర్వహించిన ఆరోగ్య సిబ్బంది



మాచవరంలో రోగులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



నాగుల్లంక సీహెచ్‌సీ వద్ద ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉంటూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మాచవరంలో పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యాధికారి వి.గౌతమి అధ్యక్షతన నందంపూడి విమెన్ డవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ పెచ్చెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న 10 మంది రోగులకు పౌష్టికాహారాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. అంతకుముందు అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ముక్కామల పీహెచ్‌సీలో డాక్టర్ జీవీ గీతాంజలి ఆధ్వర్యంలో పుల్లేటికుర్రులో క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరుగురు రోగులను దత్తత తీసుకుని వారికి పౌష్టికాహార కిట్లను సర్పంచ్ జల్లి బాలరాజు చేతుల మీదుగా అందజేశారు. టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్‌లు హెల్త్ అసిస్టెంట్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నాగుల్లంకలో..

పి.గన్నవరం: క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.శ్రీవల్లి, కె.సుబ్బరాజు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా నాగుల్లంకలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని వారు వివరించారు. దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వాస్పత్రికి వచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ కారుపల్లి సునీత, ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, కె.మేరీరత్నం, ఏకే దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాగుల్లంక పీహెచ్‌సీ పరిధిలో క్షయ వ్యాధి సోకిన 10 మంది రోగులను జనని ఫౌండేషన్ సరెళ్ల ప్రసాద్‌కుమార్ దత్తత తీసుకున్నారు. వారికి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక పంచాయతీ వద్ద ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వ్యాధి సోకిన వారిని గుర్తించి ఆరోగ్య సిబ్బంది నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజోలు టీబీ యూనిట్ వైద్యాధికారి యునుస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి బాక్టీరియా క్రిమి గాలి ద్వారా సోకుతుందన్నారు. రెండు వారాలు పైబడి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, దగ్గినపుడు ఛాతీలో నొప్పి లక్షణాలు గలవారు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి నివారణపై వైస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత, వైద్యాధికారులు ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీశంకర్ అన్నారు. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో శుక్రవారం జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యాన క్షయ నిర్మూలన అవగాహన ర్యాలీ జరిగింది. హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ఫార్మాసిస్టు సుగుణ లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మూడు వారాలు పైబడినా దగ్గు తగ్గకపోతే అది క్షయవ్యాధి కావచ్చు? అటువంటి వారు అప్రమత్తమై దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కొత్తపేట సీహెచ్‌సీ, వానపల్లి, అవిడి పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. కొత్తపేటలో వైద్యవిధాన పరిషత్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మండలంలోని అవిడి పీహెచ్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఆ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధిపై అవగాహన, నివారణ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా ఆస్పత్రుల వైద్యులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, డాక్టర్ సి.మధుకర్, డాక్టర్ హనుమాన్, ఎంపీహెచ్‌ఏ వాడ సద్గుణరావు తదితరులు పాల్గొన్నారు. వానపల్లిలో ఆ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో భాగంగా అవగాహన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎస్ఎస్‌బీ హర్ష, సిబ్బంది ఎస్‌వీ రామారావు తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి పంచాయతీ వద్ద అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిబాబు



పెదపళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



కొత్తపేటలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తొత్తరమూడిలో..

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి పంచాయతీ పరిధిలోని క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో అయినవిల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ వారా జయసావిత్రి అధ్యక్షతన ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు. ప్రస్తుతానికి గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులు లేకపోవడం అనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే నివారించవచ్చని ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ హసీనా అన్నారు. శుక్రవారం ఊబలంక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టోరేజీ ట్యాంకు పనులకు తొలగిన అడ్డంకి



సీతామహాలక్ష్మికి పరిహారం అందిస్తున్న కార్యదర్శి ఏసుబాబు, మాజీ సర్పంచ్ గణేష్‌బాబు

మామిడికుదురు: నగరం గ్రామంలో రూ.6 కోట్ల గెయిల్ నిధులతో చేపట్టిన ఇంటింటికీ తాగునీటి పథకం పనులకు ఏర్పడిన అడ్డంకి తొలగిపోయింది. గుర్రాల చెరువు స్థలంలో నిర్మించుకున్న భవనం తొలగింపునకు ఆక్రమణదారు తెల్లాకుల సీతామహాలక్ష్మి అంగీకరించిందని మాజీ సర్పంచ్ నీతిపూడి గణేష్‌బాబు శుక్రవారం తెలిపారు. దీనికి గాను ఆమెకు రూ.7 లక్షల నష్ట పరిహారంతో పాటు రెండు సెంట్ల స్థలం ఇచ్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చారన్నారు. సుమారు రెండున్నర దశాబ్దాల నుంచి సీతామహాలక్ష్మి గుర్రాల చెరువు స్థలంలో ఇల్లు నిర్మించుకుని అక్కడ నివాసం ఉంటుంది. ఈ స్థలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు చాలా వరకు పూర్తయ్యాయి. స్టోరేజ్ ట్యాంకు పనులకు అడ్డంకిగా ఉన్న సీతామహాలక్ష్మికి చెందిన భవనాన్ని తొలగించేందుకు అధికారులు పలు దఫాలు ప్రయత్నించారు. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో ట్యాంకు నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో స్థానిక పెద్దలు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్ గణేష్‌బాబు ఆక్రమణదారు సీతామహాలక్ష్మితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆమెకు రూ.5.05 లక్షలు నష్ట పరిహారం అందించారు. కోర్టులో ఉన్న పిటిషన్‌ను ఉప సంహరించుకున్న తర్వాత మిగిలిన మొత్తం ఇచ్చేందుకు రాజీ కుదిరింది. దీంతో సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు, స్థానికులు జాలెం కృష్ణారావు, కడలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలి



గోగన్నమఠంలో గృహ సారథులు, కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేస్తున్న పార్టీ నేతలు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సూరిశెట్టి బాబి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్ సూచించారు. గోగన్నమఠంలో శుక్రవారం జరిగిన పార్టీ గృహ సారథులు, కన్వీనర్ల సమావేశానికి గ్రామశాఖ అధ్యక్షుడు భూపతిరాజు సత్తిబాబు రాజు అధ్యక్షత వహించారు. బాబి, భగవాన్ మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రతిపక్షాలు అధికార పక్షంపై విమర్శలు చేస్తున్నాయన్నారు. గతంలో జరిగిన పాలనను, నేడు జరుగుతున్న పాలనను బేరీజు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నేతలు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు, భూపతిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కుసుమ శ్రీధర్, సాగి చిరంజీవిరాజు, ఎండీవై షరీఫ్, కోరుకొండ సహదేవ్, చిట్నీడి శ్రీనివాసరావు, బొమ్మిడి లక్ష్మి, ముత్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల్లో ఏరువాక కేంద్రాల ఏర్పాటు

అంబాజీపేట: రైతులకు ఎంతో ఉపయోగపడే నూతన ఏరువాక కేంద్రాన్ని ఏప్రిల్ ఒకటి నుండి ప్రారంభించనున్నట్లు పెద్దాపురం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు చెప్పారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రానికి విచ్చేసిన నరసింహారావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పెద్దాపురం ఏరువాక కేంద్రం ద్వారా జిల్లా అంతటికి రైతులకు విశిష్టమైన సేవలు అందించిందన్నారు. నూతన జిల్లాలు ఏర్పాటు కావడంతో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం మరో రెండు ఏరువాక కేంద్రాలను మంజూరు చేసిందన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరంలోని లాలాచెరువు, కోనసీమ జిల్లాలో ముమ్మిడివరంలోని ఎయిమ్స్‌లోను ఏరువాక కేంద్రాలు వచ్చాయన్నారు. ఒక్కొక్క కేంద్రంలోను ముగ్గురు సైంటిస్టులు రైతులకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ రెండు కేంద్రాల్లోను రైతులకు సలహాలు, శిక్షణా కార్యక్రమాలు, నూతన సాంకేతిక పరిశోధనలు రైతులకు అందించనున్నారన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేస్తే న్యూఢిల్లీ భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) నిధులు మంజూరవుతాయన్నారు. కేవీకే ఏర్పాటుకు అవసరమైన 50 ఎకరాల స్థలాన్ని జిల్లాలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేవీకే భవనాలకు, పరిశోధనలకు, ప్రయోగశాలలకు అవసరమైన స్థలాన్ని ఐ.పోలవరంలో ఐసీఏఆర్, వ్యవసాయ విద్యాలయ కమిటీల ఆధ్వర్యంలో పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా సూత్రప్రాయంగా అంగీకరించారన్నారు. పరిశీలన అనంతరం ఐసీఏఆర్‌కు నివేదిక అందిస్తామన్నారు.

కోకోతో అధిక లాభాలు



అంబాజీపేట పరిశోధన కేంద్రంలో మాట్లాడుతున్న అధిపతి శ్రీనివాసులు

అంబాజీపేట: కొబ్బరి తోటల్లో అంతరపంటగా కోకో సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొచ్చి, కేరళ జీడిమామిడి, కోకో అభివృద్ధి డైరెక్టరేట్‌ల సౌజన్యంతో కోకో సాగుపై సదస్సును అధిపతి శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కోకోలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ కోకో సాగు చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త ఎ.కిరిటీ మాట్లాడుతూ కోకో సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పెద్దాపురం ఏరువాక కో ఆర్డినేటర్ జీవీ నరసింహరావు మాట్లాడుతూ కోకో సాగులో వివిధ జాతుల ఎలుకలు, ఉడతలు నష్ట పరుస్తాయని వాటికి నివారణ చర్యలతోనే అరికట్టవచ్చన్నారు. కొమ్మ కత్తిరింపు, చీడపీడల నివారణ, సూక్ష్మపోషక లోపం గుర్తింపు, నిర్వహణ చర్యలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూషలు క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. సదస్సులో ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



మామిడికుదురులో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

మామిడికుదురు: గ్రామదేవత నూకాలమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అమ్మవారి జాతర పురస్కరించుకుని ఏటా నయినాల రాఘవులు, వెంకటరెడ్డి, జగన్నాథం, రంగారావు, కృష్ణమూర్తి, గోపాలరావుల స్మారకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నారు. కాగా అమ్మవారి జాతరలో భాగంగా జరిగిన సిరిబొమ్మ తీర్థం వైభవంగా జరిగింది. భక్తుల కోలాహలం నడుమ సిరిబొమ్మ తీర్థం అంగరంగ వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు సమర్పించారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఆరు రోజుల పాటు కనుల పండువగా జరిగాయి. సిరిబొమ్మ తీర్థంతో జాతర మహోత్సవం సంపూర్ణమైంది.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఉగాది పండగను పురస్కరించుకుని మాచవరం శివారు ముహూర్తాల చెరువుగట్టు వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయ వద్ద ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉగాది రోజున అమ్మవారి జాతరను, గురువారం తీర్థం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచార కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, పితాని శెట్టి తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

'వంతులవారీ'గా సద్వినియోగం చేసుకోవాలి



బిళ్లకుర్రులో వాడపాలెం ఓల్డ్ చానల్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్, నవీన్‌కుమార్

కొత్తపేట: వంతుల వారీ విధానంలో సరఫరా చేస్తున్న సాగునీరును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రస్తుత రబీ పంట అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ రైతులకు సూచించారు. బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ వాడపాలెం లాకులపైన వాడపాలెం ఓల్డ్ చానల్, న్యూ చానల్ కింద ఏ ఒక్క ఎకరాకు సాగు నీరు కొరత తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా 24 గంటల వంతును 48 గంటలకు పెంచి, 7.5 అడుగుల నీటిమట్టం కట్టి నీరు సరఫరా చేయాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వాడపాలెం లాకుల వద్ద గురువారం నుంచి వంతు అమలు చేస్తూ పై రెండు చానళ్లకు నీరు సరఫరా చేస్తున్నారు. కాగా మండల ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ వి.నవీన్ కుమార్, సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయా చానల్స్ మొదటి నుంచి చివర వరకూ పర్యటించి సాగునీరు సరఫరాను పరిశీలించారు. కార్యక్రమంలో వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సంపూర్ణ పారిశుధ్యంలో చెముడులంక ఆదర్శం

ఆలమూరు: సంపూర్ణ పారిశుధ్యంలోను, బహిరంగ మల విసర్జన నిర్మూలనకు సంబంధించి మండలంలోని చెముడులంక పంచాయతీ పరిధిలో కేంద్ర ఓడీఎఫ్ బృంద ప్రతినిధులు జి.సురేంద్ర, బి.రమణ పర్యటించారు. స్థానిక పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, నివాస గృహాల్లోని పలు వ్యక్తిగత మరుగుదొడ్లను శుక్రవారం వారు పరిశీలించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించుకోవడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పర్యటన సందర్భంగా సేకరించిన వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఓడీఎఫ్ బృందం తెలిపింది.

పి.గన్నవరం సీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో మాతా, శిశు సంరక్షణ కోసం అందిస్తున్న సేవలను కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి వచ్చిన 'లక్ష్య' బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కేంద్ర కమిటీ సభ్యులైన రావత్ కొత్వాల్, అమీర్‌సింగ్‌లు డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణితో కలసి సీహెచ్‌సీలో తల్లీ, పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సాధారణ డెలివరీలు, సిజేరియన్‌లు నెలకు ఎన్ని జరుగుతున్నాయో తెలుసుకున్నారు. సిజేరియన్ల కంటే సాధారణ డెలివరీలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇక్కడ అందుతున్న సేవలను పరిశీలించి కేంద్ర వైద్య ఆరోగ్యశాఖకు నివేదిక సమర్పిస్తామని బృందం సభ్యులు తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవీ సురేష్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అన్నాజీరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

ఆలమూరు: స్థానిక ఎస్సీ పేటలో ఇటీవల మృతి చెందిన ఇరువురు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆర్థిక సాయం అందించారు. మృతులు సరిపెల్ల గంగమ్మ, అంబటి లక్ష్మమ్మ నివాసానికి వెళ్లి ఒక్కొక్కరికి తక్షణ సాయంగా రూ.ఐదు వేలు, 26 కేజీల బియ్యాన్ని పంపిణీ చేశారు.

సొసైటీ భవనం పునర్నిర్మించాలి

మలికిపురం: శిథిలస్థితిలో ఉన్న మలికిపురం వ్యవసాయ సొసైటీ భవనాన్ని పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సొసైటీ పాలకవర్గ మహాజనసభ తీర్మానం చేసింది. శుక్రవారం సంఘ భవనంలో అధ్యక్షుడు చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు అధ్యక్షతన జరిగిన సభలో సంఘ టర్నోవర్ పెంచాలని తీర్మానం చేశారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుందని బుచ్చియ్య మాస్టారు పేర్కొన్నారు. రైతులు విరివిగా రుణాలు తీసుకోవడంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెంచాలని ఆయన అన్నారు. సీఈఓ రామరాజు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు జి.గౌరీపద్మావతి, కె.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఎమ్మెల్యే పూజలు



పాదలాడలో వనువులమ్మ, అంకాలమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: పొదలాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన వనువులమ్మ, అంకాలమ్మ ఆలయంలో శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజ పురస్కరించుకుని అమ్మవారిని ఎమ్మెల్యే రాపాక దర్శించుకున్నారు. పార్టీ నాయకులు కెవీఎస్ఎస్ రాజు, కంబాల చంద్రరావు, మాజీ ఎంపీటీసీ గెడ్డం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసులు, మహిళ సంరక్షణ కార్యదర్శులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

రామాలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, చింతలూరు గ్రామాల్లో నిర్మించిన రామాలయాల్లో శుక్రవారం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆలమూరులోని అగ్నికుల క్షత్రియుల పేటలో నిర్మించిన కోదండ రామాలయం, చింతలూరులోని శెట్టిబలిజపేటలో నిర్మించిన పట్టాభి రామాలయంలో ఈ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పురోహితుల బృందం తొలుత ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు.

మాదిగల సామాజిక చైతన్యం కోసమే యాత్ర

రాజోలు: మాదిగల సామాజిక చైతన్యం కోసమే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో చైతన్య యాత్రలు చేపడుతున్నట్టు ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ అన్నారు. శుక్రవారం రాజోలు మండలం ములికిపల్లి సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చైతన్య యాత్ర ప్రారంభించారు. మాదిగలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, పారిశ్రామిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. కోనసీమ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను మాదిగలకు కేటాయించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈతకోట హేమసుందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.